www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 సెప్టెంబర్ 2023
5
అన్నమయ్య

చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

చంద్రబాబును తక్షణమే విడిచి పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును శుక్రవారం అర్ధరాత్రి నంద్యాలలో ఆయన వసతిపై దాడిచేసి, జనాన్ని భయభ్రాంతులకు గురిచేసి, తెల్లవారుజామున అరెస్టు చేశారని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్షనేత జిల్లాల పర్యటనలో భాగంగా నంద్యాలలో ఉన్నప్పుడు అరెస్టు చేసిన తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. అరెస్టును భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా, చట్టబద్దంగా విచారించాలని కోరారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను గృహ నిర్బంధం చేయడం, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, ఆయన కుమారుడు లోకేష్‌ను అనుమతించకపోవడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

ప్రభుత్వ జాగా.. వేసేయ్ పాగా

- యథేచ్ఛగా చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

కాండ్ల చెరువు కాలువపై వెలసిన భవనం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో కబ్జాకు కాదేదీ అనర్హం అంటూ ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ప్రభుత్వ స్థలాలు, చెరువులు కాలవలు యథేచ్ఛగా అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణ సమీపంలో కాండ్లకుంట చెరువు కట్టకు ఆనుకుని ఉన్న పలు కాలవలు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, పట్టణంలోని మదనపల్లి రోడ్డులోని పోలీస్ స్టేషన్ సమీపంలో వెంకటేశ్వర కల్యాణ మండపానికి వెళ్లే దారిలో ఒకటవ సచివాలయం భవనం నిర్మిస్తున్న చోటచెరువుకు అనుకొని గృహాలతోపాటు షెడ్లు కూడా నిర్మిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం లేదు. గతంలో కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకట్రామయ్య చొరవ తీసుకుని బెంగళూరు రోడ్డులో కొన్ని అక్రమ కట్టడాలను కూల్చివేసినా ప్రయోజనం లేకుండాపోయింది. అక్రమ కట్టడాలకు కొంతమంది నాయకులు అండగా నిలవడంతో కూల్చివేసిన కట్టడాలు సంగతి ఏమైందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పట్టణ పట్టణంలోని కాండ్లకుంట చెరువు సమీపంలో ఉన్న 315 సర్వే నెంబరులో కాలువగా ఉండగా ఆ కాలువపై అక్రమ నిర్మాణం చేపట్టడమే కాకుండా రెండు రోజులు ప్రభుత్వ సెలవులు దినం కావడంతో మోల్డింగ్ సైతం వేసేందుకు ఏర్పాట్లు జరుగుతుండడం, ఆక్రమించుకొని ఇల్లు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం శోచనీయం. ఈ విషయమై నగర పంచాయతీ కమిషనర్‌కి ఫోన్‌లో వివరణ కోరగా ఈ విషయం ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని, సర్వే నెంబర్లు 315లో కాలువపై మోల్డింగ్ వేసేందుకు సిద్ధమైన నిర్మాణాన్ని ఆపివేశామని,ఈ విషయమై మండల తహశీల్దార్‌కి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని వివరించారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అందులో ఎటువంటి సందేహం లేదన్నారు. పట్టణంలోనే కాదు బి.కొత్తకోట మండలంలో పలు ఆక్రమణలు జరుగుతున్నాయని, జిల్లా వ్యాప్తంగా అక్రమణలను తొలగించాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. పట్టణంలో ఎలాంటి చర్యలు అధికారులు తీసుకోకపోవడమే ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్ బి.కొత్తకోట మండలంపై ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 9,768 కేసులు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గీత

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లావ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సాయంత్రం 6:30 గంటల వరకు అందిన సమాచారం మేరకు 9768 కేసులు పరిష్కరించి రూ. 2,45,62,800 కక్షిదారులకు చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చైర్మన్ జి.గీత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలు ఏర్పాటు చేశామని, ఇందులో కడపలో 6, ప్రొద్దుటూరులో 4, రాజంపేటలో1, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరు నందు ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో ఉన్న ఎం.వి.ఓ.పి నంబర్:458/2019 కేసులో రూ. 60 లక్షలు మొత్తానికి వాదులు, ప్రతివాదులు, చోళ మండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు జాతీయ లోక్ అదాలత్ లో రాజీ అయ్యారని చెప్పారు. ఈ కేసులో న్యాయవాదులుగా జి.ఎస్.మూర్తి, సంపత్ కుమార్ వ్యవహరించినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన వారందరికీ వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ జాతీయలోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ మెంబెర్స్, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకున్నారు. కోవిడ్ నియమావళిని పాటిస్తూ జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రసూన, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ భార్గవి, ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి. రాఘవరెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గీత

నిరసనాగ్రహం

- చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రాస్తారోకో, ధర్నాలు, బైక్ ర్యాలీలు
- పలువురు నేతలు అరెస్టు, గృహ నిర్బంధాలు

పీలేరు : నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

టిడిపి అధ్యక్షులు చంద్రబాబును అరెస్టు చేయడంపై నిరసనాగ్రహం పెల్లుబికింది. నంద్యాల జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌లో నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా టిడిపి శ్రేణులు మండలాల నుంచి నియోజకవర్గాలు, జిల్లాల వ్యాప్తంగా పెద్ద ఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు, బైక్ ర్యాలీలు చేపట్టాయి. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులైన నిరసనలు, ధర్నాలు, బైక్‌ర్యాలీలు, రాస్తారోకోలపై నిర్బంధాన్ని ప్రయోగించడం విస్మయాన్ని కలిగించింది. జిల్లాల్లో టిడిపి శ్రేణులు పెద్దఎత్తున చేపట్టిన నిరసనలు చేపట్టడంతో ఉదయం కొంతసేపు నెల కొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌టిసి అధికారులు రాకపోకలను నిలిపేశారు. ముందుజాగ్రత్తల్లో భాగంగా ఆర్‌టిసి బస్సుల రాకపోకలను నిలిపేసింది. ఊహించని రాజకీయ పరిణామాలతో ఆర్‌టిసి రాకపోకల నిలిపేయడంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం గమనార్హం. తర్వాత యధాతథంగా బస్సు సర్వీసులు నడిచాయి.

నాయకులు అరెస్టు : నిరసన చేయడానికియత్నించిన టిడిపి ఇన్‌ఛార్జి రమేష్ కుమార్‌రెడ్డి, గాజుల ఖాదర్‌బాషాను పోలీసులు అరెస్టు చేసిన సుండుపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాలివీడు రోడ్డు వద్ద నిరసన చేస్తున్న టిటిడి మాజీ బోర్డు మెంబర్ ప్రసాద్ బాబును ఆరెస్టు చేసి స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టణంలోని కడప-చిత్తూరు రహదారిలో నిరసన చేస్తున్న టిడిపి నేత మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మి ప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను పోలీసులు అడ్డుకొని మండిపల్లి భవన్‌కు తరలించి గృహ నిర్భంధం చేశారు. టిడిపి రాష్ట్ర పాల ఏకరి రాష్ట్ర కన్వీనర్ గురిగింజ కుంట శివప్రసాద్ నాయుడుతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేశారు. **మదనపల్లె అర్బన్:** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పలుచోట్ల ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించి వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టమోటా మార్కెట్ యార్డ్ ఎదురుగా మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తనయులు చాణక్యతేజ, యశస్విరాజ్, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అరుణ్ తేజ్, మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా తనయుడు జునైద్ అక్బరీ కార్యకర్తలతో కలసి నిరసన చేస్తుండగా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. **రాజంపేట అర్బన్ :** టిడిపి సీనియర్ నాయకులు చమర్తి జగన్ మోహన్‌రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత, అభిమానులు బైపాస్ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరుకొని నల్ల బ్యాడ్జిలు ధరించి కడప-తిరుపతి జాతీయ ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనలు చేపట్టారు. పోలీసులు అక్కడకు చేరుకొని జగన్మోహన్‌రాజు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమర వెంకటనరసయ్య, మాజీ మహిళా అధ్యక్షులు పత్తిపాటి కుసుమకుమారితో పాటు ఆందోళనకారులను అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. **కలకడ :** మండల కేంద్రమైన కలకడ పోలీస్టేషన్‌లో ఎస్ఐ తిప్పేస్వామి ముందస్తు జాగ్రత్తగా టిడిపి నాయకులను హౌస్ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మండల టిడిపినాయకులు దగ్గుపాటి వెంకటేశ్వరరావు, జిలానీబాషా, ఆవులప్ప, శ్రీనివాసులునాయుడు, వెంకటరమణ పెద్దోడు నవాబుపేట సర్పంచ్ గుర్రం శివలను అరెస్టు చేశారు. **సుండుపల్లి :** మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్ల బ్యాడ్జిలతో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులను పోలీసులు అడ్డుకొని కార్యాలయానికే పరిమితం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రెడ్డప్ప, శివకుమార్ నాయుడు, ఆనంద్ నాయక్, దామోదర్ నాయుడు, సురేష్ నాయుడు, చంద్రమౌళి, వెంకటరమణ, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. **కలికిరి:** మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో కలికిరిలో మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడంపై నిరసన వ్యక్తం చేసి సిఐడి చర్యలను తీవ్రంగా ఖండించారు. **సుండుపల్లి :** రాష్ట్రంలో అరాచక పాలన రాజ్యమేలుతోందని మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించారు. శనివారం సుండుపల్లె పోలీస్ స్టేషన్‌లో ఆయనను నిర్బంధించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి లండన్‌లో ఉంటూ చంద్రబాబు నాయుడును అరెస్టు చేసేందుకు కుట్రపన్నారని విమర్శించారు.చట్టాలను గౌరవించే వ్యక్తి చంద్రబాబు నాయుడు అలాంటి వ్యక్తిని అర్ధరాత్రి నిర్బంధించడం సిగ్గుచేటన్నారు. **చిట్వేలి:** టిడిపి పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా చిట్వేలిలో టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కొత్తబస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్సీ బత్యాల అరెస్టును తెలుసుకున్న తెలుగు తమ్ముళ్ల భారీగా స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు మోహరించారు. బిసిఆర్ ను విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాకర్ల సుబ్బరాయుడు, కాకర్ల నాగార్జున, బొప్పాయి గుండయ్య, నరసింహనాయుడు, బాలు రెడ్డయ్య, సత్యనారాయణ, గుత్తి నరసింహ, నాగార్జున, రామాంజులనాయుడు, శివ, చంద్రమోహన్ నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నాయకులు పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వేణుగోపాల్, టిడిపి నాయకులు చుక్కా యానాది, పాటూరు రమేష్, జ్యోతి శివ, తాటి సుబ్బరాయుడు, తోట శివశంకర్, నారపు శెట్టి వేణు, చామంచి పెంచలయ్య, కానకుర్తి వెంకటయ్య, గౌస్ బేగ్, బీమా మునుస్వామి, బొమ్మిశెట్టి శంకర్, గుండు సురేష్, పాల్గొన్నారు.

మదనపల్లి : మార్కెట్ యార్డ్ వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నేతలు

రాజంపేట : ఎన్‌టిఆర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న జగన్మోహన్‌రాజు

రాయచోటి : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రసాద్‌బాబు, నాయకులు

అన్నదానం చేస్తున్న దాతలు

అన్నదానం మహాదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రామసముద్రం మండలంలో గెవి తిమ్మరాయస్వామి మోరులో వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి 4వ శ్రావణ శనివారం పర్వదినాన్ని పురస్కరించుకొని వచ్చిన భక్తులకు కాంగ్రెస్ పీలేరు నియోజకవర్గం కన్వీనర్, మదనపల్లి పట్టణ అధ్యక్షులు ఎస్.రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు వై.సురేంద్రరెడ్డి, రామసముద్రం మండల కాంగ్రెస్ నాయకులు ఖాదర్ బాషా, చలపతి, మర్రినంజే గౌడ ఇంకా నాయకులు, కార్యకర్తలు ఇక్కడికి పెద్దఎత్తున విచ్చేసిన ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ హిందూ సోదరులు శ్రావణమాసపు శనివారాలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు.

థియేటర్లలో క్యాంటీన్ల దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి - కడప

సినిమా థియేటర్లలో టిక్కెట్లు కంటే తినుబండారాలు కొనాలంటే భయమేస్తుందని, క్యాంటీన్ల దోపిడీని అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. థియేటర్‌లోకి వెళ్లి ఒక కూల్‌డ్రింక్ లేదా పాప్‌కార్న్ కొనాలంటే తిరిగి టికెట్ ధర కొన్నంత ఖర్చు అవుతుందని తెలిపారు. పాప్‌కార్న్ ధర రూ.60, కూల్‌డ్రింక్ రూ. 60, ఎగ్‌పఫ్ రూ. 40 ఇలా ధరలు చూస్తే వణికి పోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ పట్టించుకోవడం మానేశారని విమర్శించారు. ఇదే పాప్‌కార్న్ ధర బయట రూ.10కే విక్రయిస్తున్నారని తెలిపారు. కనీసం తాగునీటి వసతి కూడా థియేటర్‌లో లేదని వాపోయారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం దారుణమని వాపోయారు. అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సినిమా థియేటర్లను పరిశీలించి క్యాంటీన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు సమావేశంలో కాంగ్రెస్ పార్టీ హుమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ, కార్మిక విభాగం నగర అధ్యక్షుడు ఉదయ్,నాయకులు అశోక్, సిద్దు, పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

కడప అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులను ఎస్‌టియు నగరశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు ఎస్‌టియు రాష్ట్రకార్యదర్శి ఎస్.ఎం.డి.ఇలియాస్‌బాష తెలిపారు. శనివారం కడపలోని వివిఆర్ ఎస్‌టియు భవన్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కడప వివిధ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఎం.జరీనా బానో, ఎస్.యాస్మిన్ బేగమ్, ఎస్.నజీబుల్లా, ఎస్.సాధిక్ అలీ, మైదుకూరు మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎమ్.మునెయ్య, బద్వేలు మండలంలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న జి.థామస్‌లను శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య, ఆర్థిక కార్యదర్శి మహబూబ్ భాష, జిల్లా నాయకులు సుబ్బారెడ్డి, ఖదీర్ బాష, సూర్యనారాయణరెడ్డి, మండలనాయకులు రామ్మోహన్, ఓబన్న, రాజశేఖర్, అదిల్, అఫ్జల్, సహబుద్దిన్, అహమద్ హుస్సేన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాందాస్ చౌదరి

వైసిపి దాష్టీకాన్ని అందరూ గమనిస్తున్నారు : జనసేన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గత కొన్ని రోజులుగా వైసిపి చేస్తున్న దాష్టీకాన్ని విపక్షాలు, ప్రజలు అందరూ గమనిస్తున్నారని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి అన్నారు. కమ్మవీధిలో జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు రేపో మాపో నన్ను కూడా అరెస్టు చేసే అవకాశం ఉంది అన్నారంటే ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలు ఏ విధంగా ఉన్నాయో అర్థం అవుతాందన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రి 14 సంవత్సరాలు రాష్ట్రాన్ని పరిపాలించిన వ్యక్తిని, ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడిని సరైన ఎఫ్ఐఆర్ లేకుండా, స్కాం జరిగిందని, ఎటువంటి ఆధారాలు లేకుండా సాక్షాధారాలు లేకుండా 73 ఏళ్ల పెద్దాయనను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండి స్తుందన్నారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, రామసముద్రం మండలం ఉపాధ్యక్షులు గడ్డం లక్ష్మీపతి,ఐటీ విభాగ నాయకులు జగదీష్, లక్ష్మినారాయణ కల్లూరు,జంగాల గౌతమ్, గండికోట లోకేష్, నవాజ్, జనర్దన్ పాల్గొన్నారు.

పీలేరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు నైతిక చర్యగా భావిస్తున్నామని, ఆ అక్రమ అరెస్టును జనసేన పార్టీ తరపున దీన్ని ఖండిస్తున్నామని జనసేన ఇన్‌ఛార్జి దినేష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ఒక మాస్క్ అడిగిన పాపానికి దళిత వైద్యాధికారైన డాక్టర్ సుధాకర్‌ని పిచ్చివాడిని చేసి చంపేశాడని, సొంత పార్టీ ఎంపీ రఘురామ కృష్ణంరాజుని అరెస్టు చేయించి జైలుకు పంపి అక్కడ చంపించబోయాడని, జనసేన పార్టీ జాతీయ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను విశాఖపట్నంలో పర్యటించడానికి అవకాశం ఇవ్వకుండా అడ్డు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని ఎత్తి చూపితే జీర్ణించుకోలేకపోతున్నాడని చెప్పారు. సొంత బాబాయ్‌ని చంపిన వాడిని పక్కన పెట్టుకున్న సిఎం నార్త్ కొరియా కిమ్ జాన్ లా తయారవుతున్నాడని ఎద్దేవా చేశారు.

తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి

కడప అర్బన్ : ఉక్కాయిపల్లిలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి. ఎం.ఓబులేసు, నాయకులు యస్. యూసఫ్ డిమాండ్ చేశారు. శనివారం ఉక్కా యిపల్లెలో డివైఎఫ్ఐ నగర కమిటీ నేతృత్వంలో పర్యటించారు. ఈ సందర్భంగా డి.ఎం. ఓబులేసు మాట్లాడుతూ పందుల బెడద నుంచి ఉక్కాయపల్లి ప్రజలను కాపాడాలన్నారు. ముక్కాయపల్లె ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తి అవుతున్న డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయడంలో కార్పొరేషన్ యంత్రాంగం పూర్తిగా విఫలం చెందిందని వారు మండిపడ్డారు. 20 ఏళ్లుగా నివాసం ఉన్న ప్రజలకు నీటి సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గుర వుతున్నారని తెలిపారు. పలుమార్లు నీరు ఏ సమయంలో వస్తాయో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. పందుల సైరవి హారంతో వృద్ధులు, చిన్నపిల్లలు చాలా ఇబ్బందులు పడు తున్నారని తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో ఇప్పటికే పార్కు కోసం పనులు చేపట్టి పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదని వారి ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు సెమినార్ : ఎపి రైతు సంఘం

కడప అర్బన్: ఏపీ రైతు సంఘం కడప, అన్నమయ్య జిల్లా కమిటీల ఆధ్వర్యంలో 'వ్యవసాయ సంక్షోభం పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఆదివారం ఉదయం పది గంటలకు పాత బస్టాండ్ సిఐటియు జిల్లా కార్యాలయంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెమినార్‌లో రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభం మద్దతు ధర, రైతాంగం పట్ల పాలకుల విధానాలు తదితర అంశాలపై చర్చిస్తామని తెలిపారు. సెమినార్‌కు ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని రైతు సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

'వెలుగు'లో వరల్డ్ ఫిజియోథెరపీ డే

మదనపల్లె అర్బన్: మండలంలోని అమ్మచెరువుమిట్ట వెలుగు సంస్థలో మినిస్ట్రీ అఫ్ సోషల్ జస్టిస్, నేషనల్ ట్రస్ట్ వారి ఆదేశాల మేరకు వరల్డ్ ఫిజియోథెరపీ డేని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంజనా ఫిజియోథెరపీ క్లినిక్ వైద్యులు డాక్టర్ జె.బి.కవితారెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ హాజరయ్యారు. వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మిని వేదికపైకి ఆహ్వానించారు. మొదటగా వెలుగు కన్వీనర్ వెలుగు సంస్థ కార్యకలాపాల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా అంజనా ఫిజియోథెరపీ క్లినిక్ వైద్యులు మాట్లాడుతూ ఫిజియోథెరపీ అంటే కదలికలు లేని కండరాలని, ఫిజియోథెరపీలోని వ్యాయామాల ద్వారా వాటి పూర్వ స్థితికి తీసుకురావచ్చని చెప్పారు. వివిధ రకాల వికలత్వాలకు వాటికీ సరిపోయే సర్జరీ, థెరపీ ఇచ్చి కొంత వరకు మేలుచేయొచ్చని పేర్కొన్నారు. సపోర్టింగ్ పరికరాల ద్వారా సాధారణ స్థాయికి తీసుకురావచ్చని తెలిపారు. వెలుగు సంస్థలో ఉన్న దివ్యాంగులను పరీక్షించి అవసరమైన వారికి చికిత్స చేస్తే నడవడానికి, వారి రోజు చేసే కార్యకలాపాలకు సహాయపడుతుందని తెలిపారు. కొంత మంది పిల్లలను పరిశీలించి వీరికి సర్జరీ, ఫిజియో థెరపీ అవసరమని చెప్పారు. పిల్లలకు మంచి పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, స్వీటీ, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నిర్లక్ష్యం

ప్రజా'దృష్టి'

జిల్లా ప్రజాప్రతినిధుల్లో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. జిల్లా పాలనావ్యవస్థలో జిల్లా పరిషత్ ఉపాంగం కీలకమైంది. ఇంతటి కీలకమైన సర్వసభ్య సమావేశంలో పాల్గొని జిల్లా ఎదుర్కొం టున్న సమస్యలను చర్చించడం తెలిసిందే. వీటి పరిష్కారానికి ఎటు వంటి చర్యలో తీసుకోవాలనే అంశంపై చర్చించడం ఆనవాయితీ. ఇటువంటి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి జిల్లాకు చెందిన ఎంపీ మొదలుకుని జిల్లాకు చెందిన ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమెల్సీలు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్‌లు, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు హాజరు కావాల్సి ఉంది. ఇందులో జిల్లా ప్రగతికి అవరోధాలుగా మారిన సమస్యలపై చర్చలు చేయాల్సి ఉంది. అనంతరం కలెక్టర్‌తో కూడిన జిల్లా పాలనా యంత్రాంగం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు సంయుక్తంగా సమస్యలను పరిష్క రించాల్సి ఉంది. ఇందులో రాష్ట్ర స్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలు ఉంటే తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించాల్సి ఉంది. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరుతూ జడ్పీ సిఇఒ అధికార యంత్రాంగం నుంచి వారం రోజులు ముందు ఆహ్వానాలు అందినప్పటికీ పలు వురు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్లు, ఛైర్మన్లు గైర్హాజరు కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. గత జిల్లా పరిషత్ సమావేశానికి ఇటీవలే కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులైన బద్వేల్ ఎమ్మెల్యే, జమ్మలమడుగుకు చెందిన ఎమ్మెల్సీ మినహా మిగిలిన ప్రజాప్రతినిధులు గైర్హాజరు కావడం విస్మయాన్ని కలిగించింది. జిల్లా ప్రగతిని కుంటుబరుస్తున్న అంశాలపై చర్చించడానికి రావాల్సిన బాధ్యత జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులది. ఇటువంటి బాధ్యతాయుతమైన కర్తవ్యాల్ని నిర్వహించడంపై అంతులేని నిర్లక్ష్యం వహించడం దారుణం. వారం రోజులు ముందుగా ఆహ్వానాలు అందినప్పటికి కీలకమైన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కార్పొ రేషన్ డైరెక్టర్లు, ఛైర్మన్ల గైర్హాజరు కావడానికి తీరిక లేకపోవడం విస్మ యాన్ని కలిగించింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన జిల్లా పరిషత్ సమావేశానికి గైర్హాజరైన ప్రజాప్రతినిధులకు ఇంతకుమించిన మహత్కార్యానికి హాజరై ఉంటారనే వ్యంగ్యాస్త్రాలు వినిపించడం గమనార్హం. దీనికితోడు జిల్లాకు చెందిన ప్రతిపక్షాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులకు స్థానం లేకుండా పోవడం అధికార పక్షానికి ఆడిందే పాట పాడిందే పాటగా మారడం అంతులేని నిర్లక్ష్యానికి కారణమని చెప్పడంలో సందేహం లేదు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన ప్రజాప్రతి నిధులు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు బాధ్య తాయుతంగా హాజరు సమస్యల పరిష్కారంలో పాలుపంచుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పల్లెబాట కార్యక్రమంలో వైసిపి నాయకులు

పల్లెబాటలో ప్రజా సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పల్లెబాట కార్యక్రమంతో ప్రజా సమస్యలు పరిష్కారమవు తున్నాయని వైసిపినాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని సూరపువారిపల్లె పంచాయతీ, దయ్యాలపల్లెలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ దశాబ్దాలుగా తమ పల్లెకు సిసి రోడ్డు వేయమని ఎందరో నాయకులకు అర్జీలు సమర్పించినా, ఎవరు స్పందించలేదన్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించినప్పుడు తమ పల్లెకు రోడ్డు వేయడని విన్న వించు కున్నామన్నారు. వెంటనే స్పం దించిన ఎమ్మెల్యే పది రోజుల్లోనే చలిమామిడి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం చేపట్టి పూర్తిచేశారన్నారు. ఇందుకు ఎమ్మెల్యేతో పాటు స్థానిక నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలు పుతున్నామన్నారు. కార్యక్రమంలో మండలం రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రెడెప్ప, నాయకులు కుమార్‌రెడ్డి, జయరామి రెడ్డి, రామ య్య, గంగిరెడ్డి, రామకృష్ణ రెడ్డి, రమణారెడ్డి, రఘునాథ్, వెంకట రమణ, సోషల్ మీడియా కన్వీనర్ ఎస్.అన్వర్, గ్రామప్రజలు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. మండల న్యాయ సేవ సంఘం అధ్యక్షులు స్థానిక న్యాయమూర్తి ఉమర్ ఫరూక్ లోక్‌అదాలత్‌లో కక్షిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇరువర్గాల కక్షిదారుల రాజీ మేరకు 319 కేసులు రాజీ మార్గాన పరిష్కరించారు. ఈ కేసులకు సంబంధించి రూ.21,09,399లు రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగమల్లారెడ్డి , సీనియర్ న్యాయవాదులు సిద్ద లింగారెడ్డి, అరుణ్ కుమార్ హసన్ వల్లి, పోలీస్ అధికారులు, కక్షిదారులు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని పుల్లంపేటలో తిరుమల ఆస్పత్రి డాక్టర్ కిరణ్ ఎముకలు, వెన్నెముక, నరములు, ఆర్థోస్కోపి, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ టి.సుబ్బారాయుడు ఆధ్వర్యంలో ఆదివారంఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సుబ్బారాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శివాలయం వీధిలోని రాధా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ చక్కటి అవకాశాన్ని మండల ప్రజలు దరూ సద్వినియోగం చేసుకో వాలన్నారు. వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణుల నరములు, కీళ్ల నొప్పులు, వంకరకాళ్లతో బాధపడుతున్న చిన్నపిల్లలకు ఉచితంగా వైద్య సేవలందిస్తారని తెలిపారు.

13 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపేట క్రీడా ప్రాంగణంలో ఈ నెల 13, 14 తేదీలలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పీడీ బాలశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17, అండర్-13 బాలుర అండర్-14 బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, కోకో, త్రో బాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగ, అథ్లెటిక్స్, మొదలగు టీం అంశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన ఆసక్తి కలిగిన క్రీడాకారులు నియోజకవర్గ పోటీలలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ఎంఇఒలు చక్రధర్ రాజు, నాగ తిరుమలరావు పాల్గొన్నారు.

ఆయేషాను ఆదర్శంగా తీసుకోండి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రూప్-1 పరీక్షల్లో రెండవ ప్రయత్నంలోనే ప్రతిభ కనబరచి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన ఆయేషాను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జడ్‌పి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు నాగరాజు పేర్కొన్నారు. మదనపల్లి పట్టణం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన ఆయేషా తన రెండవ ప్రయత్నంలోనే గ్రూప్ 1వ పరీక్షల్లో ప్రతిభ కనబరచి డిప్యూటీ కలెక్టర్ గా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆయేషా మొదట సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరిందన్నారు. ప్రజా సేవ చేయాలని కోరికతో గ్రూప్-1 పరీక్షలు రాసిందన్నారు. తన రెండవ ప్రయత్నంలోనే లక్ష్యం నెరవేర్చుకుని డిప్యూటీ కలెక్టర్ అయిందన్నారు. విద్యార్థులు ఆయేషాను ఆదర్శంగా తీసుకుని ఇష్టంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

ఆప్ బలోపేతానికి కలిసి రావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కలసి రావాలని ఆ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా కోరారు. శనివారం వేంపల్లెకు చెందిన అహమ్మద్, తాజు, ఆశ్వీర్వాదం, ఖదీర్ అనే యువకులు ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులకు జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ప్రజా సమస్యలపై ఆమ్‌ఆద్మీ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పార్టీని బలోపేతం చేసేందుకు నడుం బిగించాలన్నారు. ఆయా వర్గాల యువకులు పార్టీలో చేరడం సంతో షకరమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ రామచందర్, మండల అధ్యక్షుడు గౌస్, సమీర్, పీరుబాషా, అబ్దుల్, రాజ్, సిరాజ్, మౌలాలి పాల్గొన్నారు.

కనిపించని ప్రకృతి వ్యవసాయం

క్షేత్ర స్థాయిలో అంచనామేర దక్కని ఫలితం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరణలోకి తేవడానికి ప్రయత్నాలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించినమేర ఫలితాలు దక్కలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 31 మంది ఐసి ఆర్‌పిలు ఉండాల్సి ఉండగా 23 మంది పనిచేస్తున్నారు. వీరికి గౌరవ వేతనం కింద నెలకు రూ.6 వేలు మంజూరు అవుతుంది. క్షేత్రస్థాయిలో రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళించడానికి ఆశించిన స్థాయిలో అవగాహన కల్పించలేదని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గించి లాభాల వైపు మళ్ళించడానికి కృషి చేయాల్సి ఉంది. అలా జరగకుండా క్షేత్ర స్థాయిలో రికార్డులకే పరిమితమైనట్లుగా ఆరోపణలున్నాయి. పంటలు సాగులో ఆశించే తెగుళ్ళ నివారణకు క్రిమి సంహారక మందులు వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం చేయాల్సి ఉంది. సిబ్బందికి సైతం ఏడు నెలలుగా వేతనాలు మంజూరు కాలేదు. ఈ నేపధ్యంలో ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై పిఆర్‌పి శ్రీ వాసులను అడగ్గా క్షేత్ర స్థాయిలో ప్రకృతి వ్యవసాయం అమలు దిశగా చర్యలు తీసు కుంటున్నామన్నారు. ఇందుకు ఐసిఆర్‌పిలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

రోడ్లపై మురుగునీరు - పట్టని అధికారులు

కొండాపురం : మండల కేంద్రమైన కొండాపురం సిఎంఆర్ కాలనీలో మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఈ దారిన నిత్యం జనసంచారం అధికంగా ఉంటుంది. కొండాపురం పాత బస్టాండ్ ప్రాంతవాసులు, సిఎంఆర్ కాలనీ ప్రజలు జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే ఇదే ఏకైక రహదారి. ఈ రహదారి పైకి చుట్టుపక్కల నివాసగృహాల నుంచి వృథా నీరు రోడ్లపైకి చేరుతోంది. అంతేకాకుండా కుళాయి నుంచి వృథా నీరు కూడా రహదారిపై పారుతోంది. ఈ పరిస్థితుల్లో ఆ దారి మురికిగా తయారవుతోంది. విద్యార్థులు, ప్రజలు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శ లున్నాయి. మురుగు నీటిలో పడి గాయాలపాలైనప్పటికీ ఏ అధికారి పట్టించు కోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు, పోలీసు అధికారులుగాని చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొనసాగుతున్న వరిసాగు

- నాట్లు వేస్తున్న బెంగాల్ వలస కూలీలు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా వరిపంట ఈ ఏడాది నామ మాత్రంగా సాగవుతోంది. ప్రతి సంవత్సరం మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, మఠం మండలాల్లో అధికంగా రైతులు వరిసాగు చేపట్టేవారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో కెసికి నీరు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో వరిసాగు పూర్తిగా తగ్గింది. పెన్నా, కుందూ, బ్రహ్మసాగర్, బోరు బావుల పరిధిలో 15వేల ఎకరాల్లో మాత్రమే వరి పంట సాగ పూర్తయింది. వారం, పది రోజులలో 5 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది. ప్రస్తుత వర్షంతో వరి సాగు పెరిగే అవకాశం కనిపిస్తోంది. చాపాడు మండలంలో కుందూనది, కెసి పరిధిలో 15 వేల ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉండగా, కేవలం 4వేల ఎకరాలకు పరిమితమైంది. మైదుకూరు,ఖాజీపేట, బి మఠం దువ్వూరు మండలాల పరిధిలో తెలుగు గంగ రిజర్వాయర్ కింద 10 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. గతంతో పోలిస్తే వరి పంట సాగు తగ్గుముఖం పట్టింది. ఇంధన ఖర్చులు పెరగడంతో వరి సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. విత్తన వడ్లకు రూ.2వేలు, ట్రిల్లర్, గేజీలు కొట్టినందుకు ఎకరాకు రూ.1600 ప్రకారం 2 దఫాలు చేపట్టాల్సి వస్తుందని రైతులు తెలిపారు. నాటేందుకు రూ.4,500, నారు మోసేందుకు రూ.800, కాడి ఎద్దులకు రూ.1,500లతో కలిపి రూ.15 వేల వరకు ఎకరాకు సాగు ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. బెంగాల్ ప్రాంతం నుండి వచ్చిన కూలీలు వరినాట్లు వేస్తున్నారు. సుమారుగా 300 మందికిపైగా బెంగాలీ కూలీలు వలస వచ్చి వరినాట్లు వేస్తున్నారు. వారికి కూడా గతంలో కంటే గిరాకీ తగ్గింది. రూ.4000 ఎకరాకు కూలీలకు తీసుకుంటూ వరినాట్లు వేస్తున్నారు. ఈ నెల చివరి వారం వరకు వరి నాట్లు కొనసాగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

కేతవరం రెవెన్యూ పరిధిలో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

పాపాఘ్ని నదిలో ఆగని ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని పాపాఘ్ని నదిలో ఇసుక అక్రమ రవాణా ఆగలేదు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా పాపాఘ్ని నది నుండి టిప్పర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రతి రోజూ రెండు పెద్ద ఇటాసి యంత్రాలతో దాదాపు 30 టిప్పర్లుతో ఇసుక రవాణా చేస్తున్నారు. పాపాఘ్ని నది నుండి దాదాపు 23 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఆ తాగునీటి బోర్లుకు సమీపంలో ఇసుకను తవ్వుతున్నారు. ఇసుక తవ్వకాలు సమాచారం మండలస్థాయి అధికారులకు తెలిసినా కూడా ఏ ఒక్కరూ స్పందించలేదనే ఆరోపణలున్నాయి. ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరుగుతుండడంతో వేసవిలో తాగునీటి, సాగు సమస్య తలెత్తే అవకాశం ఉందని ప్రజలు, రైతులు వాపోతున్నారు. యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణంగా మారిందని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులపై మండి పడుతున్నారు. ఇంటి నిర్మాణ అవసరాలకు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తే అలాంటి వాటిని అధికారులు పట్టుకొని జరిమానా, కేసులు విధిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి పూట కూడా భారీగా టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

ఇసుక అక్రమ రవాణాపై సర్పంచు రాచినేని శ్రీనివాసులు తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆయన పాపాఘ్ని నదిలోకి వెళ్లి టిప్పర్లను వెనక్కి పంపారు. ఇసుక తరలిస్తే తాగునీటికి ఇబ్బందులు వస్తాయని సర్పంచు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇసుకను తరలిస్తే అడ్డుకొంటామని సర్పంచు తెలిపారు. అయినా మళ్లీ టిప్పర్లు ఇసుక రవాణా చేసేందుకు పాపాఘ్ని నదిలోకి వెళ్లాయి.

రాత్రివేళ టిప్పర్లతో ఇసుక తరలింపు

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న సర్పంచు రాచినేని

ఘనంగా ముగిసిన శ్రావణమాసోత్సవాలు

గండి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయ స్వామి శ్రావణ మాసోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. తెల్లవా రుజా మున 5 గంటల నుండి ఆంజనేయస్వామి మూల విరాట్‌కు పలురకాల పూలతో ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజా స్వాములు అలంకరించారు. ముందుగా దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, దేవస్థాన చైర్మన్ పిలుప్రోలు రాఘవేంద్ర ప్రసాద్, ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇందుకూరు గ్రామం చప్పిటి వెంకట్రామిరెడ్డి కుమారుడు నాగార్జునరెడ్డి, ధర్మపత్ని జయ ప్రభాదేవి, వారి బ్రదర్స్ అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శ్రావణమాసం ప్రారంభం నుంచి నాలు గు శ్రావణ శనివారాలు అల్పాహారాన్ని చక్రాయపేట మండలం గంగారపు వానపల్లి గ్రామానికి చెందిన అరుపు చిన్నకృష్ణారెడ్డి ధర్మపత్ని రుక్మిణీదేవి ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆర్‌కె వ్యాలీ సిఐ గోవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. చక్రాయపేట, సురభివారు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు.

దేవాలయాల ఆవరణలో భారీ ఎత్తున అన్నదానం

మండల కేంద్రమైన చక్రాయపేటలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి, వీరభద్రస్వామి దేవాలయ ఆవరణలో దేవస్థాన చైర్మన్ మోపురి రామాంజనేయరెడ్డి అడ్వకేట్ ఆధ్వర్యంలో శనివారం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రావణమాస చివరి శనివారం పునస్కరించుకొని ఇటు రాయచోటి వైపు నుండి గండి దేవస్థానానికి వచ్చే భక్తులకు, గండి దేవస్థానం నుంచి రాయచోటి వైపునకు వెళ్లే భక్తులకు చేశారు. కార్యక్రమంలో మాజీ దేవస్థానం చైర్మన్లు కర్నాటి హరినాథరెడ్డి, చక్రపాణిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, గండి దేవస్థానం మాజీ ఇఒ యోగేశ్వర్‌రెడ్డి, దేవస్థాన వైస్ చైర్మన్ నాగభూషణం, దేవస్థాన కమిటీ సభ్యులు ఈశ్వరయ్య, రామచంద్రారెడ్డి, ఇందుకూరు శ్రీనివాసులు, టీచర్ నరసింహులు, ఆర్‌ఎంపి రామకృష్ణ, పెంచలయ్య, ఓబులేసు పాల్గొన్నారు. **వేంపల్లె :** శ్రావణ మాసం సందర్భంగా గండికి వచ్చే భక్తుల కోసం పలు చోట్ల అన్నదాన సత్రాలను దాతలు ఏర్పాటు చేశారు. వేంపల్లెలోని గండి రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద రజిత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకురాలు రాధికరెడ్డి జ్ఞాపకార్థం జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్‌టియు రాష్ట్ర నాయకుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కూడా అన్నదానం ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణుడి ఆలయం వద్ద కూడా కార్యక్రమం నిర్వహించారు.

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్‌సి వర్గీకరణ చేపట్టాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు పిచికె బాబు కోరారు. ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిలదీస్తూ శనివారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పిచ్చికె బాబు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22 వరకు జరుగు ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లోనే షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పి 9 సంవత్సరాలు గడిచిన వర్గీకరణ చేపట్టకపోవడం దారుణమన్నారు. 30 సంవత్సరాలుగా ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఉద్యమం చేస్తున్నా ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను మోసం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ పట్ల అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని వెల్లడించాలని, అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు సింగరయ్య, ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య, జిల్లా నాయకులు సబ్బగాళ్ళ నరసింహులు, సీనియర్ నాయకులు చంద్రకుమార్, బొంతల ఓబులేసు, దస్తగిరి, చంద్ర, మహేష్ నాగరాజు, మారెన్న, మల్లాంజనేయులు, నరహరి, ఓబయ్య, ఎంఇఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కె.బాల ఓబయ్య పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఎంఆర్‌పిఎస్, అనుబంధ సంఘాల నేతలు

జిపిఎస్ ప్రతిపాదన ఆమోదయోగ్యం కాదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సిపిఎస్ స్థానంలో జిపి ఎస్ తీసుకురావాలనే ప్రభుత్వ ప్రతి పాదన ఉద్యోగులకు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ఎపి ఎస్‌టిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు సి.శ్రీనివాసులు అన్నారు. శనివారం తన కార్యాల యంలో విలేకరులతో మాట్లాడుతూ పాత పద్ధతిలో పింఛను మాత్రమే సరైన పరిష్కారమన్నారు. ఉద్యోగి తమ జీతంలో చందా కట్టి పింఛన్ పొందడం అనేది బాధాకరమన్నారు. దీన్ని వెంటనే రద్దు చేసి ఒపిఎస్‌ను అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్నికల హామీగా ఇచ్చిన సిపిఎస్ రద్దును వెంటనే ప్రకటించి ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు విద్యాసాగర్, జిల్లా కార్యదర్శి గంటా రామమోహన్, శివరామయ్య, వెంకట సుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చనిపోయిన వారి పింఛన్లు స్వాహా

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలోని ఆయా సచివాలయాల పరిధిలో చనిపోయిన వారి పింఛన్లను వెల్ఫేర్లు స్వాహా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఫించన్లు స్వాహా విషయమై ఆలస్యంగా వెలుగులోకి రావడంతో అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది. గత నాలుగు సంవత్సరాలుగా ఆయా సచివాలయ పరిధిలో చనిపోయిన వారి పేర్లను తొలగించకుండా కొందరు వెల్ఫేర్లు వారి లాగిన్ ద్వారా స్వాహ చేసినట్లు సమాచారం. 3, 6 సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది తమ చేతివాటం ప్రదర్శించారనే ప్రచారం జరుగుతోంది. ఫించన్లు డబ్బులు స్వాహా విషయం వేంపల్లెలోని వైసిపికి చెందిన పెద్ద నాయకుడి దృష్టికి పోవడంతో విచారణ చేయాలని ఆ అధినేత చెప్పడంతో అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన బదిలీల్లో సచివాలయంలో పని చేసే వెల్ఫేర్లు వేరే చోటికి బదిలీ అయినప్పటికీ వారు వారి లాగిన్ ద్వారా ఆ ఫించన్లను ఆ ప్రాంతానికే బదిలీ చేసుకొని డబ్బులు డ్రా చేసుకుంటున్నట్లు సమా చారం. 6వ సచివాలయంలో చిన్నబ్బి అనే వ్యక్తి 2021లో చనిపోయి నప్పు టికీ ఇప్పటి వరకు ఫించన్లు డబ్బులు డ్రా చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా.. చనిపోయిన వారి డబ్బులు స్వాహా చేసిన దానిపై ఫిర్యాదు రావడంతో విచారణ చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల్లో అన్ని సచి వాలయాల్లో నుండి సమాచారం తెచ్చు కొని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు. అవినీతి చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకొంటామని ఎంపిడిఒ తెలిపారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : కాంగ్రెస్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఆంధ్రప్రదేశ్‌లో రాక్షస పాలన సాగుతోందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ తీవ్రంగా విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని సిబిఐ అధికారులు అరెస్టు చేస్తారని వైసిపి నాయకులు రాష్ట్రమంతా ధర్నాలు, రాస్తారోకోలు చేశారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు క్రమంలో టిడిపి నాయకులను గృహనిర్బంధాలు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఒక రాజకీయ పార్టీ సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటే మరో రాజకీయపార్టీ వారి జెండాలతో అక్కడికెళ్లి అడ్డుకోవడమేంటని, ఇందుకు పోలీసులు వత్తాసు పలకడమేంటని ఆయన అన్నారు. వైసిపి పోలీసులతో పాలన సాగిస్తోందన్నారు. కేరళలో మాజీ ముఖ్య మంత్రి ఉమెన్‌చాందీ మృతితో ఉప ఎన్నిక నిర్వహించిన పుతుప్పలిలో ఆయన కుమారుడు యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థి చాందీ ఉమెన్ 37,719 ఓట్ల మెజార్టీ విజయం సాధించారన్నారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు నజీర్ కృతజ్ఞతలు తెలిపారు.

నందలూరు : లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి లత

'లోక్‌అదాలత్'లో కేసులకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి-నందలూరు

మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ 563 కేసులకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా జడ్జి కె.లత మాట్లాడుతూ సివిల్ కేసుల్లో రూ.13,13,449లు, క్రిమినల్ కేసులు రూ.28,61,100లు ఫిర్యాదారులకు అందించినట్లు తెలిపారు. క్రిమినల్ కేసుల్లో రూ.63,650లు రూపాయిలు గవర్నమెంట్ ఖాతాకు జమ చేయడం జరిగిందన్నారు. మొత్తం రూ.42,38,199లు పరి ష్కారం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎపిపి, న్యాయవాదులు, కోర్ట్ కానిస్టేబులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.అంజని ప్రియదర్శని నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా 265 కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కేసులతోపాటు రూ. 53,18,454 లక్షల నగదు కూడా రికవరీ చేశామని వారు పేర్కొన్నారు. **పీలేరు :** కేసుల పరిష్కారంలో ఇరు పక్షాలు రాజీ పడటం మంచి పరిణామమని పీలేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శనివారం స్థానిక న్యాయస్థానంలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా జరిగిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కోర్టుల్లో అపరిష్కృతంగా ఉన్న కేసుల్ని రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా కక్షి దారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. అంతేకాకుండా లోక్ అదాలతో పరిష్కారం అయ్యే కేసులకు తిరిగి కోర్టుకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదని తెలిపారు. ప్రజలు తమ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ లను వినియోగించుకోవాలని కోరారు. అర్హులైన వారు ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 280 కేసులు పరిష్కరించి రూ.1,45,19,730లు రికవరీ చేశారు. కార్యక్రమాల్లో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, ప్రభుత్వ ఎపి శారద, సిఐ మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌ఎండి అన్సారి, న్యాయవాదులు చిన్న రెడ్డప్ప, నాగరాజ పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌కు హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు

క్రైం కార్నర్

ప్రమాదంలో నుజ్జునుజైన కారు

మృతి చెందిన శంకర్‌రెడ్డి

రెండు కార్లు ఢీ

- ఒకరు మృతి, పలువురికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సమీపంలో ఉన్న ఇందిరమ్మ కాలనీ వద్ద చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీ కొని ఒకరు మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సిఐ నాగేంద్ర, ఎస్ఐ తిప్పేస్వామిలు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన క్షతగాత్రులను సిఐ తన సొంత వాహనంతో పాటు 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండలంలోని దేవులపల్లికి చెందిన కారు డ్రైవర్ కె.శ్రీనివాసులు, గుడిబండ పంచాయతీ ఎల్లం గుడిబండకు చెందిన కృష్ణయ్య కుమారుడు సతీష్, సంపూర్ణ, దీపలు కలసి కారులో దేవులపల్లి నుంచి ప్రొద్దుటూరుకు ఓ కార్యక్రమానికి బయలు దేరినట్లు తెలిపారు. అదే సమయంలో రాయచోటికి చెందిన ఎస్.శంకర్ రెడ్డి(49)అతని సోదరుడు రాజారెడ్డిలు కారులో రాయచోటి నుంచి కలకడ మండలం ఆరిపెంటదిన్నెలో జరిగే ఒక ప్రయివేట్ కార్యక్రమానికి వస్తుండగా ఈ రెండు కార్లు ఎదురెదురుగా వస్తూ స్థానిక ఇందిరమ్మకాలనీ వద్ద ఢీ కొన్నాయని చెప్పారు. ఈ ప్రమాదంలో రాయచోటి నుంచి వస్తున్న కారులో ప్రయాణిస్తున్న ఎస్ .శంకర్‌రెడ్డి (49) కి తీవ్ర రక్త గాయాలు కావడంతో రాయచోటికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. కలకడ నుంచి ప్రొద్దుటూరు వైపు వెళు తున్న కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు రక్త గాయాలు కావడంతో వారిని రాయచోటి వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుర్రంకొండ మండలంలో శనివారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడి మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో చేరారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తరిగొండకు చెందిన ఖాదరవల్లి బైక్‌లో సొంత పనిమీద గుర్రంకొండకు వెళుతుండగా మార్గమధ్యంలోనే గుర్రంకొండ టమోటా మార్కెట్ వద్ద కడప నుంచి కారులో బెంగళూరుకు వెళుతున్న అడ్వకేట్ నారాయణ, అతని భార్య వెంకటసుబ్బమ్మ, వారి సహాయకుడు రామ్మూర్తి, కారు డ్రైవర్ లక్ష్మయ్యలు ప్రయాణిస్తున్న కారు బైక్ ఢీకొందన్నారు. ఈ ప్రమాదంలో బైక్ లో ప్రయాణిస్తున్న ఖాదరవల్లితోపాటు కారులో బెంగళూరుకు వెళుతున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. గాయపడిన వారిని 108 సిబ్బంది చికిత్సల నిమిత్తం మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వారికి మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నారు. ఘటనపై గుర్రంకొండ ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దంపతులపై దాయాదుల దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పాడి ఆవుల కోసం పొలంలో పెంచుకున్న గడ్డి విషయమై దంప తులపై దాయాదులు దాడి చేసిన ఘటన కురబలకోట మండలంలో జరిగింది. ఈ ఘటనలపై పోలీసులు తెలి పిన వివరాల మేరకు.. మండలంలోని మట్ల వారిపల్లి పంచాయతీ వనమరెడ్డిగారిపల్లికు చెందిన మల్రెడ్డి, అతని భార్య సుశీల గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ బావి దగ్గర పాడి ఆవుల కోసం గడ్డిని పెంచు కుంటున్నారని చెప్పారు. గడ్డి ఏపుగా పెరిగి దాయాదుల పొలంగట్లపై పడడంతో వారు ఆ గడ్డిని ధ్వంసం చేశారని అన్నారు. ఈ విషయమై నిలదీసిన దంపతులపై దాయాదులు పెద్ద గోపాల్ రెడ్డి, చిన్న గోపాల్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, సుశీల మరి కొందరు మూకుమ్మడిగా దాడి చేసినట్లు తెలిపారు. గాయపడిన దంప తులను చికిత్స నిమిత్తం కుటుంబీకులు మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించగా వై ద్యులు పరీక్షించి వైద్యం అందించడంతో కోలుకుంటున్నట్లు తెలిపారు. బాధి తుల ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడిలో గాయపడిన భార్య,భర్తలు